# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | HYDERABAD







చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

## రంజిత్ రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..

### కేసీఆర్ విమర్శ

రంజిత్ రెడ్డి పార్టీ ఫిరాయింపుపై కేసీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పుణ్యాన గెలిచిన వ్యక్తి అని..ఆయనకు ఏం తక్కువ చేశామని ప్రశ్నించారు. ఆయన ఏమైనా పొద్దు తిరుగుడు పువ్వా? అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్తారా! అని ఎద్దేవా చేశారు. అధికారం కోసమా? పదవుల కోసమా? పైరవీల కోసమా! అని ప్రశ్నించారు. ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించామని, తానే స్వయంగా వచ్చి ప్రార్థిస్తే ప్రజలు రంజిత్ రెడ్డిని గెలిపించారని కేసీఆర్ గుర్తు చేశారు. బీజేపీ తరపున పోటీ చేస్తున్న వ్యక్తి గానీ..కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఎంపీగా గెలవక ముందు ఎవరికీ తెల్వరన్నారు. దయచేసి ఆలోచన చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే అనేక మంది నేతలు ఒక పార్టీ నుంచి మరొక పార్టీలోకి జంప్ అవుతున్న నేపథ్యంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీలో అధిక ప్రాధాన్యత కల్పించిన రంజిత్ రెడ్డి పార్టీ ఫిరాయింపు పాల్పడడం సరైంది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభలో అశేష జనవాహిని

# జయం ఖాయం..
# జనమే సాక్ష్యం
## కాసానికి జై కొట్టిన ఉద్యమ గడ్డ
### జాతరలా కిక్కిరిసిన చేవెళ్ల సభ.. కేసీఆర్ ప్రసంగానికి నీరాజనాలు

రంగారెడ్డి, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మెడలు వంచాలంటే ప్రజల చేతికి ఒక అంకుశం కావాలని.. అలాంటి వ్యక్తి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. అనుభవం ఉన్న వ్యక్తి అని, బలహీనవర్గాల కోసం కాసాని తన జీవితాన్ని ధారబోశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ కాసాని సుపరిచితుడని, జడ్పీ చైర్మన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజానీకానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. చేవెళ్ల సభ సక్సెస్ కావడంతో కాసాని విజయం ఖాయమైందని వ్యాఖ్యానించారు. కాసాని గెలుపు బీసీల అభివృద్ధికి మలుపు అని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వేదికగా కేసీఆర్ శనివారం లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఫరా ఇంజినీరింగ్ కళాశాలలోని మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీసీలకు దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కాంగ్రెస్ నాయకుడొకరు సవాల్ విసిరారని, కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుని చేవెళ్ల పార్లమెంటులోని బీసీలు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలంటే అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఉందన్నారు.

#### పారిశ్రామిక కేంద్రంగా చేవెళ్లను తీర్చిదిద్దాం..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేవెళ్ల ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దామని కేసీఆర్ పేర్కొన్నారు. షాబాద్, సీతారాంపురం, చందనవెల్లిలో వెల్‌స్పన్, కిటెక్స్, అమెజాన్ ఈస్టర్, ఎలక్ట్రిక్ వెహికిల్ తయారీ కంపెనీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశామన్నారు. వికారాబాద్, చేవెళ్ల, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు సాగు నీళ్లు తెచ్చేందుకు పాలమూరు ప్రాజెక్టును చేపట్టామని చేవెళ్ల ప్రాంతానికే నీరందించేందుకు ఉద్దండాపూర్ రిజర్వాయర్‌ను నిర్మించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో, యావత్ తెలంగాణలో భూముల ధరలు ఎట్లుండె..ఇప్పుడు ఎట్లున్నాయని కేసీఆర్ అన్నారు. ఉన్నట్టుండి రియల్ ఎస్టేట్ ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న బ్రోకర్లు ఎవరు? జోకర్లు ఎవరు? అని ధ్వజమెత్తారు. బహిరంగ సభలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు వాణీదేవి, దయానంద్ గుప్తా, యెగ్గె మల్లేశ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రాంబాబు యాదవ్, జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, కాలె శ్రీకాంత్, నీరటి తన్విరాజ్, కాలె జయమ్మ, ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నక్షత్ర, కాలె భవానీ, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేందర్ గౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నర్సింగ్‌రావు, గోపాల్, నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు మిట్ట వెంకట రంగారెడ్డి, పాపారావు, నర్సింగ్ రావు, ప్రశాంత్ గౌడ్, వికారాబాద్ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసాని వీరేశం, కొంపల్లి అనంతరెడ్డి, దేశమళ్ల ఆంజనేయులు, కొప్పుల అనిల్‌రెడ్డి, మల్లారెడ్డి, మంగలి యాదగిరి, కర్నె శివప్రసాద్, పోలీస్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కలిసిరానున్న చేవెళ్ల సెంటిమెంట్
### ముందుండి నడిపిస్తున్న సబిత

**లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్** పార్టీ చేవెళ్ల నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అన్ని రాజకీయ పార్టీలు ఇక్కడి నుంచే కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తూ వస్తుండగా..బీఆర్ఎస్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో అదే అస్త్రాన్ని ప్రయోగించింది. వైఎస్ గెలుపునకు చేవెళ్ల సెంటిమెంట్‌గా నిల్వగా..గత అసెంబ్లీ ఎన్నికల్లో, తాజా లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చేవెళ్ల వేదికగా సభలు, సమావేశాలను నిర్వహించి అధికారంలోకి వచ్చింది. బీజేపీ పార్టీ సైతం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే ప్రాంతంలో సభను నిర్వహించింది. జాతీయ స్థాయి నేతలు సైతం ఈ సభల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చేవెళ్ల సెంటిమెంట్‌గా మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో ఇదే సెంటిమెంట్‌ను అనుసరించాలని సంకల్పించి చేవెళ్ల నుంచే లోక్‌సభ ప్రచారాన్ని మొదలు పెట్టాలని నిర్ణయించి తొలి సభను ఇక్కడే నిర్వహించారు. ఈ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో రాష్ట్రం అంతటా బీఆర్ఎస్‌కు తిరుగు ఉండదని, పార్లమెంటు ఎన్నికల్లో విజయ దుందుభి మోగించడం ఖాయమన్న భావన ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతున్నది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మొదటి నుంచీ ముందుండి నడిపిస్తూ క్యాడర్‌లో కొత్త ఉత్తేజాన్ని నింపుతూ వస్తున్నారు. చేవెళ్ల సభ సక్సెస్ కావడంలోనూ కీలకపాత్ర పోషించారు. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే ముఖ్యనేతలతో సమాలోచనలు జరపడమే కాకుండా.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సభ సక్సెస్‌కు తనవంతు పాత్ర పోషించారు.సభ సక్సెస్ కోసం సన్నాహక సమావేశాలు సైతం నిర్వహించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల వారీగా నేతలకు బాధ్యతలు అప్పగించారు. ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి కేసీఆర్‌కు భరోసా ఇవ్వడంతోపాటు ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను ఆశీర్వదించాలని ఇచ్చిన పిలుపునకు జనం స్పందించి అశేషంగా తరలివచ్చారు.



### బీసీ నేతకు అవకాశం ఇవ్వడం సంతోషకరం
- ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే

తెలంగాణను పోరాడి తెచ్చిన గొప్ప నాయకుడు కేసీఆర్. పదేండ్లలో ఊహించని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వడం సంతోషకరం. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులంతా ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో గెలిపించాలి.



# దేశవ్యాప్తంగా దోచేశారు
### 18 అకౌంట్లతో రూ. 26 కోట్లు వసూలు
### పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసాలు
### ఇద్దరు నిందితులు అరెస్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ దేశవ్యాప్తంగా దోచేసిన ఇద్దరు ఘరానా నేరగాళ్లను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత కథనం ప్రకారం...కేరళకు చెందిన సీహెచ్. నౌషద్, సీహెచ్. అహ్మద్ కబీర్ ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడే నిందితులకు బ్యాంక్ అకౌంట్లు అందిస్తుంటారు. ఈ క్రమంలో నిందితులిద్దరూ 2021లో కేరళకు చెందిన ఇస్సాక్, తాహెర్ అలీని సంప్రదించి, ఆన్‌లైన్ మోసాలకు సహకరించాలని కోరారు. అంతే కాకుండా నకిలీ కేవైసీలతో నకిలీ అకౌంట్లను తెరవడంతో పాటు కొన్ని బ్యాంక్ ఖాతాలను అద్దెకు తీసుకుని మోసపూరితంగా నగదు బదిలీ చేసేందుకు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో 18 ఖాతాల ద్వారా అమాయకుల నుంచి పెట్టుబడి పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు రూ. 26 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అనంతరం దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి ఇండియన్ కరెన్సీని క్రిప్టో ఎక్స్ఛేంజ్ ద్వారా యూఎస్‌డీటీలోకి మార్చుకుని పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఓ వ్యక్తికి అంతర్జాతీయ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి బాధితుడి నుంచి రూ. 9.44 లక్షలు వసూలు చేశారు. ఎంతకీ డబ్బులు వాపస్ ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు.. నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. ఈనెల 11న నౌషద్, అహ్మద్ కబీర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 5 సెల్ ఫోన్లు, 8 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# నగరానికి నీటి కొరత లేకుండా..

- జంట జలాశయాల నుంచి అదనపు జలాలు
- సాగర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్‌కు ఏర్పాట్లు
- సమీక్షలో ఎంఏయూడీ చీఫ్ సెక్రెటరీ దానకిశోర్

సిటీబ్యూరో: నగరంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా తాగునీటి సరఫరా చేయాలని అధికారులను ఎంఏయూడీ చీఫ్ సెక్రెటరీ దానకిశోర్ ఆదేశించారు. వాటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో తాగునీటి వసతులపై శనివారం ఆయన సమీక్షించారు. సెక్షన్ల వారీగా నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్, డెలివరీ, లైన్‌మెన్ల పనితీరుపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ఉండే లైన్‌మెన్ల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. నీటి సరఫరాలో ఆటంకాలు కల్పిస్తే విధుల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు. జల మండలి నాణ్యత యాప్‌లో నీటి సరఫరా, క్వాలిటీ వివరాలు నమోదు చేయాలన్నారు.

#### 20 ఎంఎల్‌డీల నీరు

నగర తాగునీటి అవసరాలకు జంట జలాశయాల నుంచి అదనంగా 20 ఎంఎల్‌డీల నీటిని వాడుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మీరాలం, ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ 100 శాతం పనిచేసేలా మరమ్మతులు చేయాలన్నారు. పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఐదు కేఎల్ సామర్థ్యం కలిగిన వంద మినీ ట్యాంకర్లను సమకూర్చుకుంటున్నట్లుగా తెలిపారు. వీటితో పాటు 2.5 కేఎల్ సామర్థ్యం కలిగిన 75 మినీ ట్యాంకర్లు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ ట్యాంకర్లతో డెలివరీ సమయాన్ని 12 గంటలకు తగ్గించాలన్నారు. అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

#### సాగర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్...

నాగార్జునసాగర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15 తర్వాత ఎప్పుడైనా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డితో పాటు ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎం, జీఎం, మేనేజర్లు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న ఎంఏయూడీ చీఫ్ సెక్రెటరీ దానకిశోర్




నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

## దానం.. ఎమ్మెల్యే పదవికి
# రాజీనామా చెయ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 13: సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌కు తార్నాకలో నిరసన సెగ తాకింది. బీఆర్ఎస్ తరపున ఎన్నికైన దానం..వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యువజన విభాగం నగర గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని హఫీజ్ గార్డెన్‌లో కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలుపుతుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆలకుంట హరి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా ఎలా పోటీ చేస్తారని ప్రశ్నించారు. తార్నాక నుంచి కార్పొరేటర్‌గా గెలిచి, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి మారడాన్ని తప్పుబట్టారు. దానం నాగేందర్, మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## రాగల 24 గంటల్లో..



సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోయాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.8, కనిష్ఠం 26.2, గాలిలో తేమ 50శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావం కొనసాగుతుండడంతో రాగల 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై, నగరంలో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

# అయ్యో.. దారుణం
### చిన్నారిని చిదిమేసిన వీధికుక్కలు
### ఆరుబయట ఆడుకుంటుండగా దాడి..
### తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి



చిన్నారి దీపాలి (ఫైల్)

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13: నగరంలో వీధి కుక్కలు మరో చిన్నారిని పొట్టనపెట్టుకున్నాయి. అభంశుభం తెలియని పసికందును చిదిమేశాయి. ఈ హృదయవిదారకర ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన విశ్వం ప్రసాద్ మంజుదేవి దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు ఛత్తీస్‌గడ్‌లోనే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఇద్దరు కుమార్తెలతో కలిసి నగరానికి వలస వచ్చిన దంపతులు.. కుత్బుల్లాపూర్‌లోని సుచిత్ర సమీపంలోని గాయత్రీనగర్ గోదావరి హోమ్స్‌లో ఓ బహుళ అంతస్తుల నిర్మాణ పనుల్లో కూలీ పనులు చేసుకుంటూ.. అక్కడే తాత్కాలికంగా కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గుడిసెల్లో నివాసముంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం దంపతులు పనుల్లో నిమగ్నమవ్వగా, వారి చిన్న కూతురు దీపాలి (రెండున్నరేండ్లు) అక్కతో కలిసి ఆరుబయట ఆడుకుంటున్నది. ఈ క్రమంలో వీధి కుక్కలు అక్కడికి వచ్చాయి. దీపాలి అక్క భయంతో పరుగులు తీసింది. అయితే దీపాలి మాత్రం అక్కడే భయంతో ఏడ్చుకుంటూ ఉండటంతో ఒక్కసారిగా వీధి కుక్కలు విచక్షణరహితంగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని తల్లిదండ్రులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం చిన్నారి మృతి చెందింది. కండ్ల ముందటే అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు..విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.